# ట్రాఫికర్



హస్తినాపురం జడ్పీ రోడ్డులో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జడ్పీ రోడ్డులో వెంకటేశ్వరకాలనీ దగ్గర స్తంభించిన ట్రాఫిక్

- హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జాం
- రోడ్డుపైనే తోపుడు బండ్లు, చిరువ్యాపారుల తిష్ట
- వ్యాపార సముదాయాలకు పార్కింగ్ లేకపోవడంతో..
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు

**హస్తినాపురం:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని తెలంగాణ చౌరస్తా నుంచి టీకేఆర్ కమాన్ వరకు ఉన్న జిల్లా పరిషత్ రోడ్డులో ప్రతినిత్యం ఏదో ఒకచోట ట్రాఫిక్ స్తంభించి పోవడంతో ఈ రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపుల ఏదో ఒకచోట చిరువ్యాపారులు, తోపుడు బండ్లు రోడ్డును ఆక్రమించుకోవడంతో రోడ్డు కుంచుంచికుపోయి వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

### రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు..

జిల్లా పరిషత్ రోడ్డుకు దాదాపు 20 కాలనీలకు పైగా ముఖద్వారంగా ఉండటంతో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, దీంతో తరచూ ట్రాఫిక్ మూలంగా ప్రమాదాల బారిన పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ రోడ్డు మొదట 100 ఫీట్లు ఉండగా తర్వాత 80 ఫీట్లకు ఆ తర్వాత 60 ఫీట్లకు తగ్గించారని కొన్ని ప్రాంతాల్లో 40, 30 ఫీట్లకు పరిమితం కావడంతో తరచూ రోడ్డులో ట్రాఫిక్ జాం అవుతుంది. దీంతో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి..

జిల్లా పరిషత్ రోడ్డుతో పాటు హస్తినాపురం చౌరస్తా నుంచి జడ్పీ రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో సాయంకాలం వేళల్లో కనీసం నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకుంది. వారాంతపు సంతలు ఏర్పాటు చేసినప్పుడు రద్దీ సమయాల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో ఫుట్‌పాత్‌లను సైతం వదలకుండా వ్యాపారాలు చేస్తుండడంతో తరచూ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఈ రోడ్డులో ఏదో ఒకచోట గంటల తరబడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

### అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి...

ఈ రోడ్డులో నివాస ప్రాంతాలకు నిర్మాణ అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలు నిర్మిస్తూ అక్రమ సెల్లార్లను సైతం నిర్మిస్తుండడంతో స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జిల్లా పరిషత్ రోడ్డులో జరుగుతున్న ఆక్రమణలను అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వివిధ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

### ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల వల్లే..



హస్తినాపురం జడ్పీ రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురై అక్రమ నిర్మాణాల వల్లనే ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌బీనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి కారణంగానే ఎలాంటి సెట్ బ్యాక్‌లు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. నివాసప్రాంతాలకు అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నా అడ్డుకునే పరిస్థితి లేదు. రోడ్డు ఆక్రమణలను తొలగించి అక్రమ నిర్మాణాలను తొలగించినట్‌లైతే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చు.

– దుర్గయ్యగౌడ్, హస్తినాపురం, వెంకటేశ్వరకాలనీ

### అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు..



హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డులో అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాలకు పార్కింగ్ లేకుండా వ్యాపారలు చేస్తే చర్యలు తప్పవు. వ్యాపార సముదాయాలకు తప్పనిసరి పార్కింగ్ ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపారస్తులు నడుచుకోవాల్సిందే. తెలంగాణ చౌరస్తా నుంచి మొదలుకొని టీకేఆర్ కళాశాలకు వెళ్లే రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాలు నిర్వహించే వారితో సమావేశం ఏర్పాటు చేసి రోడ్లపై అక్రమ పార్కింగ్‌ల సమస్యను పరిష్కరించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– భూపతి గట్టుమల్లు, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

## ప్రజావాణిలో 5 ఫిర్యాదులు

**చాదర్‌ఘాట్:** ప్రతి సోమవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు వచ్చాయని సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. అజంపురా డివిజన్ నుంచి అక్రమ కట్టడాలపై 3 ఫిర్యాదులు రాగా, ఓల్డ్ మలక్‌పేట నుంచి 2 ఫిర్యాదులు శానిటేషన్‌పై వచ్చినట్లు డీసీ తెలిపారు. ఈ ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించినట్లు ఆయన తెలిపారు.

## 'ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు'

**చాదర్‌ఘాట్:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)కు సర్కిల్–6లో ఏ మాత్రము స్పందన లేదని డిప్యూటీ కమిషనర్ మలక్‌పేట జయంత్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ..ఎల్‌ఆర్‌ఎస్ కోసం 654 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఏడుగురు మాత్రమే ఫీజులు చెల్లించారని తెలిపారు. ప్రతిరోజూ ఫోన్ చేసి బతిమిలాడినా ఎవరు ఎల్‌ఆర్‌ఎస్ కట్టడానికి రావట్లేదని తెలిపారు. మార్చి 31 వరకు ఈ ఎల్‌ఆర్‌ఎస్ అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ స్కీమ్‌లో 25 శాతం సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేక కౌంటర్‌తో పాటు ఒక అధికారిని కూడా నియమించామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

## ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



వేడుకల్లో శ్వేతారెడ్డి తదితరులు

**మన్సూరాబాద్:** విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు ప్రోత్సాహిస్తున్నామని కాకతీయ గ్రూప్ ఆఫ్‌స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ పి. శ్వేతారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని కాకతీయ పాఠశాలలో ఆదివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, రాధ, జోనల్ ప్రిన్సిపాల్ రమేష్‌చంద్ర, ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్‌గా బోయపల్లి

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఏఐసీసీ విచార్ విభాగ్ చైర్‌పర్సన్, ఎంపీ చేతుల మీదుగా రాఘవేందర్‌రెడ్డి నియామకపత్రం అందుకున్నారు. విచార్ విభాగ్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర కాంగ్రెస్ నాయకులకు రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటి పన్ను చెల్లించాలని ధర్నా




స్కూల్ ఎదుట బైఠాయించిన కార్పొరేషన్ అధికారులు, కార్మికులు

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 16వ డివిజన్‌లో ఉన్న జాన్ మిల్టన్స్ హైస్కూల్ యాజమాన్యం గత 10 సంవత్సరాలుగా ఇంటి పన్ను చెల్లించనందుకు సోమవారం పాఠశాల ఎదుట కార్పొరేషన్ అధికారులు, కార్మికులు బైఠాయించారు. ఇప్పటివరకు రూ.3లక్షలకు పైగా పాఠశాల నిర్వాహకులు బాకీ పడ్డారని ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా ఇక్కడి నుంచి కదిలేది లేదని బీష్మించారు. ఇంటి పన్ను చెల్లించాలని పాఠశాల సిబ్బందిని కోరగా సహకరించలేనందుకు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్, సెక్షన్ ఆఫీసర్, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్స్, జవాన్‌లు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, స్వీపర్లు ఉన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

**చార్మినార్:** తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుంకరి వీర శేఖర్ అన్నారు. సిటీ కాలేజ్ చౌరస్తా వద్ద నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలలో ఐదు మంది వాహనదారులు మద్యం సేవించి పట్టుబడ్డారన్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారన్నారు. కేసులో 5 మందిని జైలుకు పంపారు. సైదాబాద్‌కు చెందిన వెంకటేష్, గచ్చిబౌలికి చెందిన సుభాష్, చెలాపురా ప్రాంతానికి చెందిన మాలిక్, లాల్ శర్మ, ఇసామియా బజార్‌కు చెందిన గౌస్ తదితరులను 5వ జేఎంఎఫ్సీ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారమన్నారు. ఇందులో వెంకటేష్‌కు ఒక రోజు, సుభాష్‌కు 3 రోజులు, గౌస్, లాల్ శర్మ, మాలిక్‌కు 2 రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి వరుసగా రూ. 3300 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

## అర్హులైన పేదలకు 'డబుల్' ఇళ్లను కేటాయించాలి



హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

**మన్సూరాబాద్:** అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అందజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టి తహసీల్దార్ జానకీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన రేషన్‌కార్డులను మంజూరు చేయకపోవడంతో సంక్షేమ పథకాలు పేదలకు దక్కలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డును అందజేయాలన్నారు. హయత్‌నగర్ మండల పరిధిలోని అర్హులైన వారికి, గతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు దరఖాస్తు చేసిన వారికి కేటాయించాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.6లక్షల సహాయం అందజేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి శోభన్, అరుణ్‌కుమార్‌గౌడ్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, రామావత్ సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్

**మహేశ్వరం:** సీనియర్ న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయేల్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించి మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు హత్యకు గురైన న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహాయం కోసం వచ్చిన మహిళకు అండగా నిలిచినందుకు దస్తగిరి అనే నిందితుడు న్యాయవాది ఇజ్రాయేల్‌ను కత్తితో అతి కిరాతకంగా పొడిచి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుటివారికి సహాయం చేయడం తప్పా ఇతరులకు హాని చేయరన్నారు. న్యాయవాదిని హత్య చేసిన దస్తగిరిని కఠినంగా శిక్షించి, ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. అంతకు ముందు న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇజ్రాయేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## 'ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటాం'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా

**నాగోలు:** ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్తా అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీలోని సాయిబాబా ఆలయంలో శ్రీ వాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జగిని అశోక్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి సాయి రమేష్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ..25 కోట్ల మంది ఉన్న ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పెద్ద పెద్ద వ్యాపారాలు కూడా ఆర్యవైశ్యులవే అని, ఆర్యవైశ్యులు అందరూ కలిసి మెలసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహా గుప్తా, అరుణ, ఉపేందర్, అశోక్‌గుప్తా, అరుణ సురేందర్, అశోక్, వాసుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మురుగు సమస్యకు త్వరలో చెక్



మురుగు సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**చంపాపేట:** శుభోదయ కాలనీలో నెలకొన్న మురుగు సమస్యకు ప్రత్యేక నిధులతో త్వరలో చెక్ పడుతుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యభారతితో కలిసి కాలనీలో పర్యటించి మురుగు, గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలోనే కాలనీలో సీసీ రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయించామని, భూగర్భ డ్రైనేజీ విస్తరణ అనంతరం పనులు ప్రారంభించాలనే ఉద్దేశంతోనే పనులు కొంతమేర ఆలస్యం అయిందన్నారు. కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో కొంతమేర స్థానికులకు అసౌకర్యం కలుగుతుందని కాలనీ వాసులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముడుపు రాజిరెడ్డి, సదానందరెడ్డి, మల్లేష్‌గౌడ్, జగదీష్, శివగౌడ్, అంజిరెడ్డి, ఉమామహేశ్వర్, విఠల్ రెడ్డి, నరేష్, రాజు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.28, కాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.12, క్యారెట్ రూ.23, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.23, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.40, మునగ రూ.23, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.17, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

## నేడు రాజరాజేశ్వరి త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం

**మలక్‌పేట:** మూసారంబాగ్ దుర్గా రాజరాజేశ్వరి త్రిశక్తి ఆలయం 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం పాల్గుణ బహుళ ఏకాదశి రోజున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి కాటేపల్లి రాజేశ్వరావు తెలిపారు. విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..మంగళవారం ఉదయం 8.30 గంటలకు విశేష అభిషేకాలు, అనంతరం 10 గంటలకు చండీ హోమం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుదని పేర్కొన్నారు. సమావేశంలో కోశాధికారి విష్ణు, జంగయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి విశాల్, ఉపాధ్యక్షులు మావురం నర్సింహ్మ, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, జంగారెడ్డి, ప్రధాన అర్చకులు దేశపతి నాగరాజు శర్మ పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**వనస్థలిపురం:** వనస్థలిపురం, పరిసర ప్రాంతాల్లోని 38 క్రైస్తవ సంఘాలతో కూడిన 'ది క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్'నూతన కమిటీని ఆదివారం రాత్రి వనస్థలిపురంలోని క్రైస్ గాస్పల్ చర్చిలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.దీన్‌దయాళ్, ఉపాధ్యక్షుడిగా ఆర్.జే.వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జాన్, కోశాధికారిగా ఎస్.ఏలియా, సంయుక్త కార్యదర్శులుగా బుజ్జులు క్లియోపస్, పి.సుధాకర్‌బాబు ఎన్నికయ్యారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ప్రభాకర్‌రావు తెలిపారు.

## మహిళ అదృశ్యం



అనురాధ

**చైతన్యపురి:** భర్త ఇబ్బందులు పెడుతున్నాడని లెటర్ రాసి ఓ మహిళ అదృశ్యం అయిన ఘటన చైతన్యపురి స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సత్యనగర్‌లో నివసించే రావుల సురేష్, అనురాధలకు 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. అనురాధ రామంతపూర్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఉద్యోగానికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన అనురాధ తిరిగి రాలేదు.'నా భర్త నన్ను టార్చర్ పెడుతున్నాడు. ఇంట్లో నుంచి వెళ్లి పోతున్నాను. నా కోసం వెతకకండి'అని అనురాధ రాసిన లెటర్ దొరికింది. అనురాధ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ




వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

**వనస్థలిపురం:** ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.కృష్ణ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మహేశ్వరం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. క్షయ (టీబీ) వ్యాధిని మొదటి దశలోనే గుర్తించడం, దానిని ఎలా నిర్మూలించడం అనే విషయంపై ఆసుపత్రి సిబ్బందికి, ఆసుపత్రికి వచ్చిన రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రాములు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డా.జయమాల, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద చెరువులోకి డ్రైనేజీ మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


**మన్సూరాబాద్:** పెద్ద చెరువులోకి డ్రైనేజీ మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని పెద్ద చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ నర్సింహారెడ్డి సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవపాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువు ఎఫ్‌టీఎల్‌పై కోర్టు కేసు ఉండటంతో ఇబ్బందులున్నాయని, వరద కాలువ ఎఫ్‌టీఎల్ వద్ద నిలిచి పోయిందని కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. చెరువులోకి వరదనీరు చేరితే సమీప కాలనీలలో భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండ పెద్ద చెరువు ప్రాంగణంలో మరోక ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించాలని కోరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వేమారెడ్డి, నాంపల్లి రామేశ్వర్, వెంకటరామ్, భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

**హస్తినాపురం:** బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంటితాళాలు పగులగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైదేహినగర్‌కాలనీకి చెందిన టి..వి.సుబ్రమణ్యం తన కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 20న మధురానగర్ కాలనీలోని తన బంధువుల శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి పక్కవారు గేటు తాళాలు పగుల గొట్టి ఉండడాన్ని గమనించిన వారు సుబ్రహ్మణ్యంకు ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. సుబ్రహ్మణ్యం దంపతులు వెంటనే ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని లాకర్‌లో ఉన్న 19 తులాల బంగారు ఆభరణాలను, కొంత నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే వనస్థలిపురం పోలీసులకు సమాచారం అందించడంతో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వైదేహినగర్‌లోని సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఘనంగా కల్చరల్ డే

**మన్సూరాబాద్:** భాష్యం హైస్కూల్ వనస్థలిపురం బ్రాంచ్ కల్చరల్ డే వేడుకలు మన్సూరాబాద్ చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాష్యం విద్యాసంస్థల జడ్ఈఓ అంకమ్మరావు హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అకాడమిక్ టాపర్స్‌కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఆరుగురు

యువకుడి హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

**నాగోలు:** శివగంగ కాలనీలో శనివారం అర్ధరాత్రి పాత కక్షల నేపథ్యంలో బొడ్డు మహేష్‌ను గొడ్డళ్లు, కొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన ఆరుగురిని ఎల్‌బీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. గతంలో బొడ్డు మహేష్‌కు పగిళ్ల పురుషోత్తంకు జరిగి చిన్న చిన్న గొడవలు పెరిగి పోయి హత్య దారి తీశాయి. గతంలో పురుషోత్తంపై హత్య యత్నం చేయించిన మహేష్ ఇటీవల జైలు నుంచి తన స్నేహితులతో బయటకు వచ్చాడు. మహేష్ జైలు నుంచి బయటకు వచ్చిన విషయం తెలుసుకున్న పురుషోత్తం తన స్నేహితులతో కలిసి మహేష్ హత్యకు స్కెచ్ వేశారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహేష్‌ను కారుతో ఢీ కొట్టి కింద పడిన అనంతరం గొడ్డళ్లు, కొడవళ్లతో దాడి చేసి హత్య చేశారు. మృతి చెందిన మహేష్ సోదరి మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి మహేష్ హత్యకు పాల్పడిన మీర్‌పేట, నందిహిల్స్‌లో నివాసం ఉండే పగిళ్ల పురుషోత్తం, భరత్‌నగర్ కాలనీ చెందిన నోముల నాగార్జున, భరత్‌నగర్ కాలనీ చెందిన మంద సందీప్, సికింద్రాబాద్ తుకారాం గేట్ చెందిన గడమోని రాము, మలక్‌పేట, శంకర్‌నగర్‌కు చెందిన లపంగి రాజా రాకేష్, ఆలియాస్ చింటూ, మేడ్చల్, వివేకానంద నగర్‌కు చెందిన కుంచాల ఓంకార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.